విశాఖ రాజధాని వద్దంటూ ప్రజల ముందుకు వెళ్లగలరా?

- జిల్లా అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలి
- టీడీపీ నాయకులకు కృపారాణి సవాల్
- వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి
- భూకబ్జాలకు ఆద్యుడు, రాజగురువు చంద్రబాబే...

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : విశాఖ రాజధాని వద్దంటూ అదే ప్రధాన అజెండాగా టీడీపీ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసి ఎన్నికలకు వెళ్లగలరా అంటూ కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి సవాల్ విసిరారు. నగరంలోని వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సుదీర్ఘకాలంపాటు రాజకీయాల్లో కొనసాగిన టీడీపీ నాయకులు, ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు సిక్కోలు జిల్లా అభివద్ధికి చేసిన కృషి ఏంటో చెప్పాలన్నారు. జిల్లా అభివద్ధిపై టీడీపీ నాయకులు బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ఉద్దానానికి రూ.700 కోట్ల నిధులతో ప్రజల ప్రయోజనం కోసం మంచినీటి ప్రాజెక్టును తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డిదేనని ఆమె స్పష్టం చేశారు. వికేంద్రీకరణతోనే రాష్ట్ర సమగ్రాభివద్ధికి దోహదపడు తుందన్నారు. భూకబ్జాలకు రాజగురువు, ఆద్యుడు చంద్రబాబేనని కపారాణి స్పష్టం చేశారు. టెక్కలిలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా, స్థానిక శాసనసభ్యునిగా కొనసాగుతున్న నాయకుడు తన సొంత నియోజకవర్గ అభివద్ధికి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. గతంలో పార్లమెంట్ సభ్యురాలిగా, కేంద్ర మంత్రిగా తన హయాంలో టెక్కలి నియోజకవర్గ పరిధిలో వేసిన రహదారుల సైతం శిలాఫలకాలు మార్చి తన అభివద్ధిగా అచ్చెన్నాయుడు గొప్పలు చెప్పుకుంటున్నారని అంతకు మించి నియోజకవర్గ అచ్చెన్న చేసిందేమీ లేదన్నారు. ఎంపి రామ్మోహన్ నాయుడు శ్రీకాకుళం జిల్లాను రాజధాని చేయాల నడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. పట్ట భద్రుల ఓటర్ల నమోదు నవంబరు 7తో పూర్తవు తుందని పట్టభద్రులు తమ ఓటుహక్కును నమోదు చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా పార్టీ అధికార ప్రతినిధి సిమ్మ.రాజశేఖర్, రాష్ట్ర కళింగ వైశ్య, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరి బాబు, మామిడి శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.వి పద్మావతి, చౌదరి సతీష్, ఎన్ని ధనుంజయ, చింతాడ రవి, కొంక్యాన మురళీ, టీ.కామేశ్వరి, చందు, రవి, పలువురు నేతలు పాల్గొన్నారు.

బీసీలకు అన్ని విధాలుగా అన్యాయం చేసింది చంద్రబాబే

- అయ్యన్న అరెస్టుకు కులాన్ని ఆపాదించవద్దు
- కార్పొరేషన్ చైర్మన్లు మామిడి, అంధవరపు

విశాలాంధ్ర-శ్రీకాకుళంకలెక్టరేట్ : సుదీర్ఘ కాలంపాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన చంద్రబాబు పాలనలోనే బీసీలకు అన్ని విధాలుగా అన్యాయం చేశారని రాష్ట్ర తూర్పు కాపు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరబాబులు మండిపడ్డారు. శుక్రవారం నగరంలో వైసీపీ జిల్లా పార్టీ కార్యాల యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చట్ట ప్రకారం తప్పు చేసిన వ్యక్తికి న్యాయం స్థానాలు చర్యలు తీసుకుంటాయని ఆ నేపథ్యంలోనే ఇరిగేషన్ చెరువుల్లో అక్రమ కట్టడాలు చేపట్టడమే కాకుండా, ఫోర్జరీ సంతకాలతో మోసం చేసిన మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులను అయ్యన్నపాత్రుడ్ని అరెస్టు చేశార న్నారు. అయ్యన్నపాత్రుని అరెస్టుకు కులాన్ని అపాదించవద్దని టీడీపీ నాయకులకు హితవు పలి కారు. 11 ఏళ్ల రాజకీయ అనుభవం, ముఖ్యమంత్రి గా విజన్ ఉన్న నాయకునిగా చెప్పుకుంటున్న చంద్రబాబు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో పదేళ్ల పాటు ఇంకా ఉమ్మడి రాజధానిగా కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ అమరావతి ఎందుకొచ్చారని ప్రశ్నించారు. బీసీలంతా జగన్ పక్షానే ఉన్నారని భవిష్యత్‌లో తమకు అధికారం దక్కదనే అక్కసుతోనే ప్రతి అంశాన్ని రాజకీయంచేస్తూ కులాన్ని ఆపాదిస్తు న్నారని వీరు మండిపడ్డారు. చంద్రబాబుకు తాను అధికారంలో ఉండగా బీసీలు గుర్తు రారని వారికి చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించరని మంత్రులు, శాసనసభ్యులుగా అవకాశం కల్పించారని తన రాజకీయ మనుగడ కోసం బీసీలపై ప్రేమ ఉన్నట్టు ప్రతి అంశాన్ని వివాదం చేయడం చంద్రబాబు అండ్ కో నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శిమ్మ రాజశేఖర్, రాము, చింతాడ రవికుమార్ తదితరులు ఉన్నారు.

దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

- నవంబర్ 25న ఛలో ఢిల్లీ-పార్లమెంట్ మార్చ్
- ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం కలెక్టరేట్ : దేశ వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలించాలని కోరుతూ, అఖిలభారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐయస్ఎఫ్) అధ్వర్యంలో నవంబర్ 25న పార్లమెంట్ మార్చ్‌ని జయప్రదం చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ కోరారు. స్థానిక ఎన్ ఆర్ దాసరి నాగభూషణరావు క్రాంతి భవన్‌లో శుక్రవారం చలో ఢిల్లీ గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయ్మెంట్ గ్యారెంటీ యాక్ట్‌ను అమలుచేయాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని నిలుపుదల ఆయనచేయాలని, దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నవంబర్ 25వ తేదీన చలో ఢిల్లీ"పార్లమెంట్ మార్చ్"కార్యక్రమంనీ జయప్రదం చేయాలని కోరారు. నరేంద్ర మోడీ అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో ప్రతిఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఎనిమిది సంవత్సరాల గడుస్తున్న నేటికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకపోగా నిరుద్యోగుల సమస్యల గురించి ప్రశ్నిస్తే నిరుద్యోగులు పకోడీ బండ్లు పెట్టుకుని బ్రతకండి అంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రులు మాట్లాడడం సిగ్గుచేటనీ అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్నటువంటి 27 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా యువతకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయ్మెంట్ గ్యారంటీ యాక్ట్ ను అమలులోకి తీసుకురావాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తులకు తొత్తుగా వ్యవహరిస్తుందని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు దారదత్తం చేయడంతోపాటు నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా వ్యవస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నం జరుగుతుందని నూతన జాతీయ విద్యా విధానాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 25 ఢిల్లీలో జరిగే పార్లమెంట్ మార్చి కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, వై మురళి, కె.శ్రీనివాస రావు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్.రవి నాయకులు దుర్గారావు, గిరి, రాజేష్ పాల్గొన్నారు.

వాలంటీర్ అర్చన ఔదార్యం

విశాలాంధ్ర -కవిటి : మండలంలోని కొత్తవరక గ్రామానికి చెందిన బల్లెడ కృష్ణారావు విశాఖ పట్నం మెడికవర్ హాస్పిటల్‌లో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈనేపథ్యంలో గ్రామ వాలంటీర్ మాదిన అర్చన శుక్రవారం అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము ను అందజేశారు. బల్లెడ కృష్ణారావు గతంలో కిడ్నీ మార్పిడి చేయించుకుని యధావిధిగా పనులు నిర్వహించుకునేవాడు. విధి వక్రించి గత కొద్దిరోజులుగా అనారోగ్యం బారిన పడి విశాఖపట్నం మెడికవర్ హాస్పిటల్‌లో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈ మేరకు మాదిన అర్చన విశాఖపట్నం మెడికవర్ హాస్పిటల్ కు వెళ్లి బల్లెడ కృష్ణారావుకు 5000 రూపాయలు పింఛన్ అందజేసింది. దీంతో పలువురు వాలంటీర్ అర్చనను ప్రశంసించారు.

చురుగ్గా ఓటర్ల నమోదు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : శాసన మండలి ఎన్నికలను తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా భావిస్తుండటంతో ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ సూచనల మేరకు ఓటర్ల నమోదు ప్రక్రియను ఆ పార్టీ నాయకులు చురుకుగా నిర్వహిస్తున్నారు. మండల, వార్డు స్థాయిల్లో ప్రతినిధులకు తోడుగా ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధి వూనా సంతోష్‌కుమార్‌తో పాటు సిద్ధూ తదితరులు గ్రాడ్యుయేట్ల దగ్గరకు వెళ్ళి ధరఖాస్తులు సేకరించి అధికారులకు సమర్పించే కార్యక్రమాన్ని చురుకుగా నిర్వర్తిస్తున్నారు.

భీమా సొమ్ము అందజేత

విశాలాంధ్ర-కంచిలి : పెద్ద శ్రీరాంపురం గ్రామానికి చెందిన మద్దిల మోహన్ రావు ఇటీవల మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులకు స్థానిక ఎంపిటిసి మాదిన విమల భీమా సొమ్ము శుక్రవారం అందజేశారు. మాజీ సర్పంచ్ మాదిరి రామారావు గ్రామ పెద్దల సమక్షంలో ఎస్బిఐ భీమ సొమ్ము 2 లక్షల రూపాయలను విమల, మోహన్ రావు కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రతి ఒక్కరు భీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈసందర్భంగా ఆమె కోరారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన డీఎల్‌డీవో

విశాలాంధ్ర-పాలకొండ : మండలం గోపాలపురం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం డీఎల్‌డీవో గోపాలకృష్ణ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలను బయోమెట్రిక్ విధానాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు ఏవిధంగా అందుతున్నాయో అడిగితెలుసుకున్నారు. హాజరు శాతం తక్కువగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-సీతంపేట : స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో పూర్తిస్థాయిలో అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా తగిన ఏర్పాట్లు చెయ్యాలని స్థానిక తహసీల్దార్ నరసింహమూర్తికి సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చందర్రావు, సూరిబాబు మాస్టారు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు

విశాలాంధ్ర-జలుమూరు: మండలం కరవంజకి చెందిన పోలీసు కానిస్టేబుల్ సంపతిరావు మల్లేశ్వరరావు (45) అంత్యక్రియలు గురువారం అధికార లాంఛనాలతో ఆయన స్వగ్రామంలో జరిగాయి. కోటబొమ్మాళి మండలం మంచాలపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కాశీబుగ్గ డీఎస్పీ ఎం. శివరామిరెడ్డి, నరసన్నపేట సీఐ డి.రాము, జలుమూరు ఎస్ఐలు హరికృష్ణ, పారినాయుడు నివాళులర్పించారు.

నేడు డయల్ యువర్ యూనివర్సిటీ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో శనివారం డైలీ యువర్ యూనివర్సిటీ కార్యక్రమాన్ని ఫోన్ ఇన్ లైవ్ లో నిర్వహించనున్నట్లు ఇంచార్జి రిజిస్టర్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వర్సిటీ అనుబంధ కళాశాల విద్యార్థులు 8247861919కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగే ఈకార్యక్రమంలో వర్సిటీ అధికారులు పాల్గొంటారని చెప్పారు.

పాతపట్నంకు, పరాయి పాలకులే ఎక్కువ.!

ఈసారి బలపడుతున్న స్థానిక నినాదం

విశాలాంధ్ర-కొత్తూరు : ఎవరు ఏ నియోజకవర్గం నుండైనా పోటీ చేయొచ్చు. ఇది పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు దాన్ని ఎవరూ కాదనలేరు. అయితే స్థానికులం మేము లేమా, పార్టీలు స్థానికులకె అవకాశం ఇచ్చి పోటీలో ఉంచాలన్న ఒత్తిడి ఇప్పుడు పాతపట్నం నియోజకవర్గ ప్రజలు నుండి ఎక్కువగా వినిపిస్తోంది. ఈ ఒత్తిడి ప్రభావం ఆయా రాజకీయ పార్టీలపై ఎంతవరకు పడుతుందో వేచిచూడాలి? ఇక స్థానికులు, స్థానికేతరులు ఎంతమంది పాతపట్నం నియోజకవర్గం నుండి ఇంతవరకు ఎమ్మెల్యేలుగా పనిచేసారో వివరాల్లోకి వెళ్దాం. శ్రీకాకుళం జిల్లాలో వేనుకబడిన, ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా ఉన్న పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారిలో ఎక్కువ మంది ఇతర నియోజకవర్గాల నుండి వచ్చి ఇక్కడ పోటిచేసి వారే ఎక్కువ మంది నాయకులున్నారు బాహుశా. ఈ కారణమేమో. ఈసారి స్థానికులే (నియోజకవర్గ పరిధిలో ఉన్నవారు) ఇక్కడ నుండి పోటి చెయ్యాలని అధిక శాతం ప్రజలు బహిరంగా అంటున్నారు పోటీకి సై అంటున్న స్థానిక నేతలు కూడా ఈ స్థానిక నినాదాన్ని గట్టిగా ప్రజలు మధ్యకు తీసుకువెళు న్నారు. 1952 లో పాతపట్నం నియోజకవర్గం ఏర్పడింది 1952 లో పాతపట్నం ద్విసభ్య నియోజకవర్గంగా ఉండేది. ఆ ఎన్నికల్లో జనరల్ స్థానం నుండి లుకలాపు లక్షణదాస్ ఎమ్మెల్యే కాగా. రిజర్వ్ (ఎస్.టి) స్థానం నుండి పార్వతీపురం ప్రాంతానికి చెందిన మండింగి పెంటం నాయుడు..(కాంగ్రెస్) ఎమ్మెల్యే అయ్యారు. 1967 ఎన్నికల్లో పొందూరు ప్రాంతని కి చెందిన పోతుల గున్నయ్య...(కాంగ్రెస్) ఇక్కడ నుండి ఎమ్మెల్యే అయ్యారు. ఇక 1983 లో కొత్తూరు నియోజికవర్గం కు చెందిన తోట తులసీ దాస్ నాయుడు (టీడీపీ) ఎమ్మెల్యే అయినారు 1996 ఉప ఎన్నికల్లో హైదరాబాద్‌కు చెందిన నందమూరి లక్ష్మి పార్వతి (ఎన్టీఆర్ టీడీఎల్పి) ఎమ్మెల్యే అయ్యారు. 2009 ఎన్నికల్లో చిన్న మోటింగి కి చెందిన శత్రుచర్ల విజయరామరాజు (కాంగ్రెస్) ఎమ్మెల్యే అయ్యారు. 2019 ఎన్నికల్లో పాలకొండ (కన్నవారు) ప్రాంతానికి చెందిన రెడ్డి శాంతి (వైసీపీ) ఎమ్మెల్యే అయ్యారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఆరుగురు ఎమ్మెల్యేలు కాగా పాతపట్నం నియోజకవర్గం కు చెందిన కలమట మోహన్ రావు(5 సార్లు ఎమ్మెల్యే) లుకలాపు లక్ష్మణదాస్ (మూడు సార్లు) చుక్కా పగడాలమ్మ ఒకసారి, కలమాట వేంకట రమణ ఒక సారి ఎమ్మెల్యే లు గా పనిచేశారు. రానున్న ఎన్నికల్లో మరి ఈ స్థానిక నినాదం ఎంత వరకు పనిచేస్తుంది అయా రాజకీయ పార్టీలు వంటి నిర్ణయాలు తీసుకుంటాయో వేచి చూడాలి.

యువత ఉపాధి నైపుణ్యం పెంపొందించుకోవాలి

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- నిరుద్యోగ నిర్మూలనకు జాబ్ మేళాలు.
- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

విశాలాంధ్ర-ఆమదాలవలస: అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినయోగం చేసుకుని ఉపాధి నైపుణ్యం పెంపొందించుకునే దిశగా యువత ముందడుగు వేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి, జిల్లా ఉపాధి కల్పనా శాఖల అధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి జాబ్‌మేళా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై యువతను ఉద్దేశించి ప్రసగించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఈరోజుల్లో ఏ ఉద్యోగ, ఉపాధి కల్పనకైనా ముందుగా ఎదురయ్యే ప్రశ్న వృత్తిలో అనుభవం గురించే ఉంటున్న విషయం యువత తెలుసుకోవాలన్నారు. యువత ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే దిశగా ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి క్రియాశీలక చర్యలు చేపడుతున్నారని చెప్పారు. ఈదిశగా యువతలో ఉపాధి, నైపుణ్యాలను విస్తృత పరచేందుకు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేక కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ను కోరుతూ స్థానిక పరిశ్రమలలో 70 శాతం స్థానికతకే ప్రాధాన్యం ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలు అమలు జరిగేలాచూడాలని, ఇంతవరకూ ఆదిశగా ఏమి ప్రయోజనం జరిగిందో సమీక్ష చేయాలని, తదనుగుణంగా నిబంధనలమేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందివచ్చిన అవకాశం చిన్నదా, పెద్దదా దూరమా, దగ్గరా అన్నది సంకోచించకుండా ఉపాధిని చేజిక్కించుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో 19 కంపెనీలు పాల్గొనగా 538 అభ్యర్థులకుగాను 176 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో మెప్మా పి.డి ఎం.కిరణ్‌కుమార్, కమిషనరు ఎం.రవి సుధాకర్, తహశీల్దార్ వై.వి.పద్మావతి, ఎంపీడీఓ ఎం.రేణుక, జెడ్పీటీసీలు బి.గోవిందరావు, ఎల్.కాంతారావు, బి.రామారావు, ఎంపీపీ ఎస్.నాగేశ్వరరావు, బి.రమేష్ కుమార్, నైపుణ్యాభివృద్ధిసంస్థ మేనేజర్ పి.బి.సాయి శ్రీనివాస్, జిల్లా ఉపాధి కల్పనాధికారి జి.శ్రీనివాసరావు, సెట్‌శ్రీ సిఈఓ బి.ప్రసాద్, సీడాప్ మేనేజర్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ప్రత్యేక సొసైటీ : మంత్రి సీదిరి

విశాలాంధ్ర-మందస : మత్స్యకారులకు సొసైటీ ఏర్పాటుచేసి వీలైనంత ఎక్కువ జీవనోపాధి కల్పించి ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డా.సీదిరి అప్పలరాజు అన్నారు. శుక్రవారం మండలం బొగాబంద పంచాయితీ డబారుసింగి రిజర్వాయరులో జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం లో ఉన్న మత్స్యకారులు, అలాగే చాపల వేట ప్రధాన జీవనాధారంగా జీవిస్తున్న గిరిజనులకు జీవనోపాధి కల్పనలో భాగంగా చేప పిల్లలను విడిచి పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జె.డి శ్రీనివాసరావు, ఎఫ్‌డివోలు ధర్మరాజుపాత్రో, ముసలినాయుడు, వియఫ్‌వో హేమలత, సాగర మిత్రలతోపాటు ఎంపిపి డొక్కరి దానయ్య, జెడ్‌పిటిసి చంద్రమ్మ, సర్పంచ్ జయ లక్ష్మీ, దుర్యోదన, అగ్గున్న సూర్యారావులు పాల్గొన్నారు.

వృద్ధులకు నగదు, పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలంలోగల అక్కయవలస గ్రామంలో ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ దువ్వాడ శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు తిమడాన లచ్చుమయ్య, తిమడాన నాగభూషన్, తర్ర శిమ్మయ్య, టి. నారాయణరావు, మెండ తవిటయ్య, మెండ సూర్యనారాయణ, రైతు సంఘం నాయకలు గ్రామంలో గల వృద్ధులకు ఖర్చులుకోసం కొంత డబ్బులుతో పాటు పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్ళి వృద్ధులకు పంపిణీ చేశారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి గ్రామస్థులకు పంపిణీ చేశారు.

వసతిగృహాన్ని సందర్శించిన తహసీల్దార్

విశాలాంధ్ర-మెళియాపుట్టి : నేలబొంతు ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ సరోజిని శుక్రవారం నాడు ఆకస్మీకంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ముందుగా రికార్డులను పరిశీలన చేయడంతో మెనూ ప్రకారం తయారు చేసిన మధ్యాహ్నం భోజనాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యాబోధన భోజన వసతి తదితర వివరాలను విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెతో పాటుగా మండల విద్యా శాఖ అధికారి దేవేందర్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు, వసతిగృహ సిబ్బంది తదితరులు ఉన్నారు. అంతకుముందు తహసిల్దార్ నేలబంతు గ్రామంలో సెల్ టవర్ నిర్మాణానికి సంబంధించి స్థల పరిశీలన నిమిత్తం నేలబంతు గ్రామాన్ని సందర్శించారు.

బుషాభద్రలో బాదుడే బాదుడు

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం బుషాభద్ర గ్రామంలో శుక్రవారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ హాజరై బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎంపి ల్యాడ్ నిధులు 5లక్షల రూపాయలతో మహేంద్రతనయ నది మెట్ల రహదారికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలు తప్ప అభివృద్ధి శూన్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటిసి సూరాడ చంద్ర మోహన్, మాజీ ఎంపిపి చిత్రాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ పనులు పూర్తి చేయండి

విశాలాంధ్ర-నరసన్నపేట : జిల్లా వ్యాప్తంగా ప్లాంటేషన్ పనులు సత్వరం పూర్తి చేయాలని జిల్లా నేటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జీవి చిట్టి రాజు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నరసన్నపేట మండలం గొట్టిపల్లి గ్రామంలో జరుగుతున్న ప్లాంటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటే కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో శత శాతం మొక్కలు ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ప్రారంభించామని, ఇందుకు సిబ్బంది కూడా బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. మొక్కల పరిరక్షణ కు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ డి.యుగంధర్, ఈసి అప్పలరాజు, ఇతర ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన అధినేతకు భద్రత కల్పించాలి!

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : ప్రస్తుతం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పై జరుగుతున్న కుట్రలను ఖండిస్తూ శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద జిల్లా నాయకులు పేడాడ రామ్మోహన్ రావు, టెక్కలి జనసేన ఇన్‌ఛార్జి కణితి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పేడాడ రామ్మోహన్, కణితి కిరణ్‌లు మాట్లాడుతూ మా పార్టీ అధినేత పై జరుగుతున్న ఈ కుట్రలు తమను తీవ్రంగా ఆందోళనకు గురిచేసిందని వాపోయారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని పవన్ కళ్యాణ్‌కి భద్రత కల్పించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పవన్‌కళ్యాణ్‌పై ఎవరైనా హాని చెయ్యాలని చూస్తే జన సైనికులు, నాయకులు సహించేది లేదన్నారు. పవన్‌కళ్యాణ్‌ని కాపాడుకునేందుకు అభిమానులు ఎంతటికైనా తెగించడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకులు భూపతి అర్జున్, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జాగృతి' అపన్న హస్తం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట పట్టణంలో గల బాలసదనాన్ని జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాంబుడ్డి గణపతి సందర్శించి అనాథ బాలలకు భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏదిక్కూ లేదని దిగులు పడకూడదని, సమాజం మిమ్మల్ని గుర్తించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎస్.జోరాడు, సిఆర్‌పి పి.మీనారావు, బాల సదనం ఇన్‌చార్జ్ ఎస్.దుర్గా, సూపర్‌వైజర్ సుజాతలు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : ఉద్యోగులు చేసిన సేవలే వారికి గుర్తింపునిస్తాయని ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎస్.ఐ మధుసూధనరావు ఆధ్వర్యంలో బదిలీపై వెళ్తున్న ఎస్.ఐ గోవిందరావు, నందిగాం సి.ఐ రాములను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎస్.ఐ గోవిందరావు, సి.ఐ రాములు వజ్రపుకొత్తూరు పోలీసుస్టేషన్ పరిధిలో అనేక సేవలు అందించారని, వారు చేసిన సేవలు వెలకట్టలేవని అన్నారు. కార్యక్రమంలో హనుమంతు వెంకటరావు, పాలిన శ్రీనివాసరావు, పుక్కళ్ల గురయ్యనాయుడు, పిఏసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధు, ఇరోతు హేమంత్, నర్తు లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

బాలసదనం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-పలాస : జిల్లా స్త్రీ సంక్షేమ అభివృద్ధి శాఖ శుక్రవారం పలాస బాలసదనంను సిసిఐ ఇన్‌స్పెక్టర్ కమిటీ తనిఖీలు నిర్వహించింది. బాల సదనంలో భోజన, మెడికల్, మెను రికార్డులను, సరుకుల స్టాక్ రికార్డులను తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు గన్య అప్పడు, జి.నర్సిహమూర్తి, మందస సిడిపివో వసుందరదేవి, డాక్టర్ దర్మాన సుమన్, బాలల రక్షణ విభాగ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మణరావు, కౌన్సిలర్ మన్మధ, ఎఫ్ఎసి సూపర్‌వైజర్ యు.లతలు పాల్గొన్నారు.

జుత్తు సేవలు మరువలేనివి : మంత్రి సీదిరి

విశాలాంధ్ర -మందస : పలాస మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత జుత్తు జగన్నాయకులు పలాస నియోజకవర్గం ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శుక్రవారం జుత్తు జగన్నాయకులు 5వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జుత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జుత్తు జగన్నాయకులు ప్రజల కోసం చేసిన సేవలు మరువలేనివని అన్నారు. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. అనంతరం ఏకాదశి సందర్భంగా నిర్వహిస్తున్న పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మందస బొట్టేశ్వర ఆలయం ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి సన్నిదానాన్ని సందర్శించారు. బొగాబద పంచాయితీలో డబారుసింగి రిజర్వాయరును పరిశీలించి అక్కడ గిరిజన రైతులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కరి దానయ్య, జెడ్‌పిటిసి సవర చంద్రమ్మ, చంద్రమ్మ, పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మండల ఉపాధ్యక్షులు కె.ఆదినారాయణ, ఎస్.ప్రసాద్, వైసీపీ నాయకులు అగ్గున సూర్యారావు, మద్దిల రామారావు, బల్ల లీలాకుమారి, కంచి బెహరా, ఎం.ఖగేశ్వరరావులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పేరున ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ దువ్వాడ శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం స్థానిక పీఏసీఎస్ అధ్యక్షులు బాడాన మురళీధర్ అధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీ కొత్తమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేకును కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యాక్షుడు బోయిన నాగేశ్వరరావు, దుక్క రామక్రిష్ణ, కమిటీ చైర్మన్ బోయిన మాధవిక్రిష్ణారావు, కవిటి రామరావు, దుంగ శిమ్మన్న, కాళ్ళ సంజీవరావు, గడ్డవలస నాగభూషణరావు, మెట్ట శాంతారావు, వేణు, ఉత్తరరావు, చిన్నప్పుడు, నూక సత్యరాజ్, నూక పుష్కారావు, కల్లి విశ్వనాథరెడ్డి, కాళ్ళ సంజీవు, సింగూరు వాసు, నారాయణ రావు, హనుమంతు దాలయ్య, కాంతారావు, తాండ్ర అప్పలనాయుడు, దుంపల మురళి, మొజ్జాడ శ్రీను, శిమ్మ అప్పన్న, సంపతిరావు రమణ, సనపల విశ్వ నాథం, రాజు, నూక శ్రీనివాస్, తోట సింహచలం, శ్రీరాములు, దండాసి సింహాచలం, సంపతిరావు జనార్ధన్, పొన్నాడ మోహన్ రావు, యస్ జనార్దన్ రెడ్డి, దుబ్బ సింహాచలం, కాళ్ళ సహదేవ్, అంకయ్య, యడ్ల మహేష్, అల్లు కళ్యాణి, బొడ్డు అప్పన్న, అరెపల్లి రవి, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జ్ఞానం పెంపొందించుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జ్ఞానం పెంపొందించుకోవాలి అని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ మరియు సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్ సన్యాసినాయుడు అన్నారు. జిలా న్యాయ సేవ అధికార సంస్థ మరియు శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తాల గోపి వారి ఆదేశం మేరకు కార్యదర్శి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ మరియు సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్. సన్యాసినాయుడు కళింగపట్నంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్జి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానమును విద్యార్థులు తమ జ్ఞానము పెంపొందించుటకు మాత్రమే ఉపయోగించాలని, సైబరు నేరాల పట్ల అత్యంత జాగూరు కథతో ప్రవర్తించాలని సూచించారు. సెల్ ఫోన్లు ఉపయోగించి తమ సమయాన్ని వృధా చేసుకోరాదని సూచించారు. విద్యార్థి జీవితంలో ప్రతిక్షణం విలువైనదని జీవితంలో ఉన్నత స్థాయి తీర్చిదిద్దేందుకు చదువు తప్ప వేరు మార్గం లేదని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్ గార ఎస్సై, ఎంపీడీవో, ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు తదుపరి, జడ్జిగారు కే మచ్చలేశం గ్రామ సచివాలయం సందర్శించారు సచివాలయం సిబ్బందితోనూ గ్రామ వాలంటీర్లతోనూ జడ్జిగారు మాట్లాడి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని కోరారు. అనంత రము జడ్జిగారు కళింగపట్నంలోని గ్రామ సచివాలయం సందర్శించి గ్రామ వాలంటీర్లు సచివాల సిబ్బందితో మాట్లాడారు వాలంటీర్ వ్యవస్థ గ్రామ సచివాలయం సిబ్బందికి ప్రజలకు మేలు చేసే అవకాశం కలిగిందని వారు ఈ అవకాశాన్ని చిత్తశుద్ధితో వినియోగించుకోవాలని కోరారు ప్రజలందరితో స్నేహ పూర్వకంగా మెలిగి వారికి ఏ సమస్య వచ్చినా తక్షణం సహాయం చేయాలని కోరారు.

చట్టం దృష్టిలో అందరు సమానులే

జూనియర్ సివిల్ జడ్జి రవిశంకర్

విశాలాంధ్ర - పలాస : చట్టం దృష్టిలో అందరు సమానమేనని పలాస జూనియర్ సివిల్ జడ్జి పి.రవి కుమార్ అన్నారు. శుక్రవారం ప్రజలందరికి న్యాయం సమానమేనని అవగాహన కల్పిస్తూ మండల న్యాయాధికారి సంస్థ చైర్మన్ సివిల్ జడ్జి అయిన పి.రవి శంకర్ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు, ఉదయ పురం, పురుషోత్త పురం, వాసుదేవపేట ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ నెల 13వ తేదీ వరకు ర్యాలీలు నిర్వహిస్తామని, ప్రజలు పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బార్ అసొసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి టి.మురళీధర్, పిండి వెంకట రమణ, పి.లక్ష్మీనారాయణ, సుధారాణి, దివ్య, లక్ష్మీ, కోర్టు సూపరిటెండెంట్ పాణిగ్రాహి, ఎజిపి దేవరాజు, సిబ్బంది, పోలీసులులు పాల్గొన్నారు.

దేవాలయాలకు పోటెత్తిన భక్త జనం

విశాలాంధ్ర - సోంపేట : కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా సోంపేట పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం వేకువ 3 గంటల నుంచి శివాలయాలు, రామాలయాలు, వెంకటేశ్వర స్వామి ఆలయాలకు, అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు. సోంపేట పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, కోదండరామ ఆలయం, విజయదుర్గా, పోలమ్మతల్లి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. లక్కవరం గ్రామంలోను, రుషికుద్ద గ్రామంలోను ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. బారువలో కోటిలింగేశ్వరాలయం, బ్రహ్మజనార్ధనస్వామి ఆలయాలు ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులతో హోరెత్తాయి.

రుషికుద్ద గ్రామంలో శుక్రవారం శ్రీఉమానీలకంఠేశ్వర ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులు వైభవంగా శివకళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు, అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటిసి తడక యశోద, జోగారావు, పండి రాజు, కర్రి కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సామూహికంగా తూటికాడ కషాయం తయారీ

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలంలోని ముద్దాడ గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో మహిళ సంఘ రైతుల సమక్షంలో రైతులతో వరి పంట లో వచ్చే సుడి దోమ నివారణకు తూటి కాడ కషాయాన్ని రైతు భరోసా కేంద్రం వద్ద తయారు చేసుకున్నారు. ఈ విధంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మన చుట్టూ దొరికే సహజ వనరులతో కషాయాలు తయారు చేసుకుని పంటలకు ఉపయోగించుకోవడం వల్ల మెరుగైన ఫలితాలు వస్తాయని మరియు భూమి, వాతావరణాన్ని కలుషితం కాకుండా సమాజానికి విషతుల్యం లేని ఆరోగ్యకరమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించవచ్చని రైతులకు ప్రకృతి వ్యవసాయం గురించి సిబ్బంది సీహెచ్ సురేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో అరుణ, ధనలక్ష్మి, అప్పల నరసయ్య పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

విశాలాంధ్ర - మందస : కార్తీక ఏకాదశి సందర్భంగా మండలంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మందస, హరిపురం, దేవుపురం, పొత్తంగి, పితాతొళి, సిరిపురం, దేవుపురం, పిడిమందస తదితర ప్రాంతాల్లో ఉన్న ఆలయాలు భక్తులతో నిండాయి. చారిత్రక నేపథ్యం ఉన్న మందస వాసుదేవుని ఆలయాన్ని వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. భక్తులు వాసుదేవుని పూజించి మొక్కులు తీర్చారు.

కాశీబుగ్గ : కార్తీక ఏకాదశి సందర్భంగా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో గల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలాస పెద్దవీధిలో 24 గంటల హరే రామ హరే క్రిష్ణ సంకీర్తన భజన ఘనంగా నిర్వహించారు. పలాస రాధాకాంత ఆలయంలో, కాశీబుగ్గ రామాలయంలో, ఉదయపురం శ్రీవెంకటేశ్వరాలయాలతో పాటు వివిధ ఆలయాలో భక్తుల పూజలు నిర్వహించారు.

సాధారణ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - జలుమూరు : విశాఖ రాజధానితో ఉత్తరాంధ్ర అభివృద్ధి : ఎమ్మెల్యే విశాఖ పరిపాలనా రాజధాని ఏర్పాటు చేయడం వల్ల ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం జలుమూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు తీర్మానం చేయాలని కోరారు. సభ్యులందరూ ఏకగ్రీవ తీర్మానానికి ఆమోదించారు.

ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేయాలి

విశాలాంధ్ర - ఆమదాలవలస : పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటును నమోదు చేసుకోవాలి వాలంటీ సహాయంతో ప్రతి గడపకు వెళ్లి నవంబర్ 7వ తేదీ

- వాలంటీర్ సహాయంతో ప్రతి గడపకు వెళ్లి నమోదు చేయండి - నవంబర్ 7 లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి
- పార్టీ కేడర్‌కు దిశా నిర్దేశం - ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం

లోపు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలి అని పార్టీ క్యాడర్ కు దిశా నిర్దేశం చేసిన ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం. ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయంలో పార్టీ క్యాడర్ తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుకున్నంత ఓటర్ నమోదు ప్రక్రియ కాలేదని నవంబర్ 7వ తేదీ వరకు పూర్తిగా ఓటర్ నమోదు ప్రక్రియలో పార్టీ క్యాడర్ ఉండాలని ఏ ఒక్క ఓటు నమోదు కాకుండా ఉండకూడదని ఆయన అన్నారు పూర్వపు ఓటర్ లిస్టు ఎన్నికల సంఘం రద్దు చేసిందని ప్రతి ఓటరుకు తెలియజేసి కొత్తగా ఓటర్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన దిశ నిర్దేశం చేశారు. ఓటర్ నమోదు ప్రక్రియలో భాగంగా ఫారం 18 తో పూర్తి చేసిన పత్రాలను తమ్మినేని సీతారాం అందజేశారు ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల వైసీపీ క్యాడర్ పాల్గొన్నారు.

పట్టణంలో కమిషనర్ పర్యటన

విశాలాంధ్ర - పాలకొండ : నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు శుక్రవారం నగర పంచాయతీ పరిధిలో పలు వార్డులను పరిశీలించారు. తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేయాలని సూచించారు. ఏ విధమైన ఫిర్యాదులు రాకూడదని, పారిశుద్ధ్య నిర్వహణపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధకనబరచాలని సూచించారు. అనంతరం సచివాలయాలను తనిఖీ చేశారు.

జగనన్న కాలనీ నిర్మాణాలు పూర్తి చేయండి

విశాలాంధ్ర - ఆమదాలవలస : వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్లలో ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని మెప్మా పి.డి., గాజుల కొల్లివలస లే అవుట్ ప్రత్యేక అధికారి ఎం.కిరణ్ కుమార్ ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం గాజులకొల్లివలస లే అవుట్‌ను సందర్శించి నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. అనంతరం కమిషనరు ఎం.రవిసుధాకర్ అధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయంలో వార్డు సంక్షేమ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.డి మాట్లాడుతూ ఇప్పటికీ నిర్మాణాలకు ముందుకురాని లబ్ధిదారులను గుర్తించి వారికి ముఖ్యమంత్రి ఆకాంక్షను తెలియజెప్పి లబ్ధిదారులచే ఇండ్ల నిర్మాణాలను ప్రోత్సహించాలని చెప్పారు. ఇండ్ల నిర్మాణాలకు ముందుకు వచ్చే వారిలో స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు రూ.35 వేల అదనపు ఋణం అందేలా చూడాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు కలిగినమేలుపై నిరంతరం చైతన్యం చేయాలని సూచించారు. జిల్లా వికలాంగ, వయో వృద్ధులశాఖ తరపున దివ్యాంగులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటర్ పంపిణీకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకునేలా సమాచారం తెలపాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో మన్యం జిల్లా ఆర్టీవో

విశాలాంధ్ర - పాలకొండ : శ్రీకోటదుర్గమ్మ వారి సేవలో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం రోడ్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్(ఆర్టీవో) శుక్రవారం దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. ఆలయ మర్యాదలతో అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ, ఈవో రాధాకృష్ణలు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

- ఆర్జీయూకేటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెసి రెడ్డి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిబుల్ ఐటీ క్యాంపస్‌లో మౌలిక సదుపాయాలు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఛాన్సలర్ కెసి రెడ్డి ప్రొఫెసర్ కేసి రెడ్డి అన్నారు. శ్రీకాకుళం ట్రిబుల్ ఐటీ క్యాంపస్ శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పియుసి ప్రథమ సంవత్సరంలో జరిగిన విద్యార్థులతో మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా చదువుపైనే దృష్టి సారించాలన్నారు. ఎలాంటి సమస్యలను అధికారులకు, అధ్యాపకులు దృష్టికి తీసుకురావాలన్నారు రానున్న రెండేళ్లలో ట్రిపుల్ ఐటీ లోని ఆరు బ్యాచిల విద్యార్థులకు ఇదే క్యాంపస్ లోనే తరగతుల నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు కోట్లతో నిర్మించనున్న వర్క్ షాప్ భవనానికి శంకుస్థాపన చేశారు. అలాగే నిర్మాణంలో ఉన్న భవనాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వరరావు, ఓఎస్డి ప్రొఫెసర్ ఎల్డీ సుధాకర్ బాబు, ఏవో సత్యనారాయణ, మోహన కృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడకు శుభాకాంక్షలు వెల్లువ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు జన్మదినోత్సం సందర్భంగా, సంతబొమ్మాళి మండలం ప్రజా ప్రతినిధులు, వైకాపా నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువలుతో ఘనంగా సన్మానించారు.

పవన్ కళ్యాణ్ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించిన దోషులను శిక్షించాలి

విశాలాంధ్ర - కవిటి : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించిన అసలైన దోషులను త్వరితగదన ఎంక్వైరీ చేపట్టి దోషులను శిక్షించాలని కవిటి మండలం జనసైనికులు కోరారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మత్యకార విభాగ వికాస కార్యదర్శి హరి బెహరా, జిల్లా ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు దివాకర్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఇంటి వద్ద జరిగిన రెక్కీ పై వీలైనంత తొందరగా దర్యాప్తు చేపట్టి అసలు దోషులను శిక్షించాలని పోలీసులకు కోరారు.ఇలాంటి పనికిమాలిన చర్యలు మానుకోవాలని ఏదైనా విధానపరమైన సమస్యలు ఉంటే రాజకీయంగా తేల్చుకోవాలి తప్ప ఇలాంటి పిరికిపంద చర్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని అన్నారు. తమ అధినాయకుడికి చిన్న పాటి హాని జరిగిన రాష్ట్రం మొత్తం అగ్నిగుండం అయిపోతుందని హెచ్చరించారు. తమకు రాష్ట్ర ప్రభుత్వం మీద నమ్మకం లేదనీ అన్నారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని తమ పార్టీ అధినాయకుడు పవన్ కళ్యాణ్ కు సరైన భద్రత కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ నాయకులు నేతాజీ, బడే రాజు, దశరథ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో కార్తీక ఏకాదశి సందర్భంగా అర్చకులు సత్యనారాయణ స్వామి, రాజేష్ స్వామి ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త పొందల కుమారి కృష్ణారావు దంపతులు చే సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామివారికి వేకువజాము నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుప్రియ రాంబాబు దంపతులు తోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత భారత్‌గా తయారు చేద్దాం

ప్రిన్సిపల్ పి.రాజేశ్వరరావు.

విశాలాంధ్ర - కవిటి : ప్లాస్టిక్ ను బ్యాన్ చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు ప్లాస్టిక్ రహిత భారత్గా తయారు చేద్దామని ప్రిన్సిపల్ పి రాజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్.ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు మాట్లాడుతూ సర్వ రోగాలకు కారణమని ప్లాస్టిక్ వినియోగమేనని, సులభంగా పనులు ముగించే టందుకు ప్రజలు ప్లాస్టిక్ వినియోగానికి బాగా అలవాటు పడిపోయాయని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులే ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఇప్పటికే చాలా పంచాయితీలు, మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించారని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వ్యక్తి గతంగా వినియోగించిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. పి.ఒ.లు నర్సింహ కుమార్ దాస్, జె. పాపారావు, అధ్యాపకులు జి. విష్ణుమూర్తి, పి.హరి, కె.ఉగాది నాయుడు, డి.అనసూయ, కె.కరుణశ్రీ, బి.శ్రీను బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా తులసి బృందావతి కళ్యాణం

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : కార్తీక మాసం ఏకాదశి పురస్కరించుకొని ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 21వ వార్డు గొల్లవీధికి చెందిన దక్కత అప్పన్న కుటుంబీకులు శుక్రవారం తులసి బృందావతి కళ్యాణ వేడుకలను ఘనంగా జరిపారు. వేద పండితులు సన్యాసిపాఢి పర్యవేక్షణలో ఉదయం పందిరి రాట అనంతరం, కళ్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపిచారు. ఆ వార్డుకు చెందిన మహిళలు, అప్పన్నకుమారులు లోకనాథం, కృష్ణమూర్తి, విశ్వనాథం, గోపీనాథ్‌ల దంపతులు ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు.

న్యాయవ్యవస్థ పై ఇంటింటా అవగాహన

విశాలాంధ్ర - ఆమదాలవలస : న్యాయవ్యవస్థపై ప్రతి మహిళకు అవగాహన కల్పించే విధంగా న్యాయ సేవా వారోత్సవ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి న్యాయవాద బృందం తిరిగి అవగాహన కల్పించారు. ముఖ్యంగా శుక్రవారం మహిళలకు అవగాహన కల్పిస్తూ ఎటువంటి న్యాయ సంబంధమైన పరిస్థితులు ఎదురైనప్పుడు సంప్రదిస్తే ఉచిత న్యాయ సేవ అందిస్తామని తెలియజేశారు. కోర్టు ఫీజులు కనీసం చెల్లించుకోలేని వారికి కూడా సత్వర న్యాయాన్ని అందిస్తామని అన్నారు. డోర్ టు డోర్ లీగల్ అవేర్నెస్ కార్యక్రమం లో రెండవ రోజు కిల్లి వారి క్వార్టర్స్, సవరాజు కోవెల వీధి, మెయిన్ రోడ్ లో ప్రచారం చేసారు. మహిళలు ను కలుసుకొని అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయ లక్ష్మి, బొడ్డేపల్లి మోహన్ రావు, రాజేష్, అన్నం నాయుడు ,సనపల ప్రసాదరావు గోవింద రాజులు, అచ్చం నాయుడు, జగ్గు నాయుడు,కోర్ట్ సిబ్బంది మరియు రక్షణ శాఖ పాల్గొన్నారు.

కేఎన్‌పిఎస్ జిల్లా మహాసభలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర - మెళియాపుట్టి : కులనిర్మాణ పోరాట సమితి వారి ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా ఆరవ మహాసభలు జరగనున్నాయని వాటిని విజయవంతం చేయాలని కే ఎన్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు బెల్లమర ప్రభాకర్ కోరారు. శుక్రవారం మండలంలోని సుర్జిని, శేఖరాపురం, గొప్పిలి తదితర గ్రామాలలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేటీకరణతో జరుగుతున్న పలు సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ నెల 12వ తేదీన పలాసలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కులనిర్మాణ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దొడ్డు ప్రభాకర్ పాల్గొన నున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోత ధర్మారావు, మిస్క కృష్ణయ్య, శారద, కృష్ణ రామారావు, కామయ్య, బాబురావు నిర్మల తదితర యువకులు పాల్గొన్నారు.

రహదారిపై మురుగు నీరుతో ఇబ్బందులు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలం మరువాడ పంచాయతీ, ఆర్ మరువాడ గ్రామంలో ఉన్న మెయిన్ రహదారి మురుగు నీరు, వర్షం వరద నీరు నిల్వ ఉండి పోతుందని, ఆ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే రహదారిపై నీరు నిల్వ ఉండటం వలన, వ్యాధులు ప్రబలుతున్నాయని, అలాగే మురికి నీటిలో నుంచి నడవాల్సి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. రహదారికి, ఇరువైపులా డ్రైనేజీలు నిర్మిస్తే, మురికి నీరు, వరద నీరు కాలువలు ద్వారా, వెళ్తుందని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి, రహదారికి ఇరు వైపులా డ్రైనేజీలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాలువలో పడి ఆవుకు గాయాలు

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : గోవుల యజమానుల బాధ్యతారాహిత్యం వల్ల అవి రోడ్ల పై వచ్చేస్తుండటంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడటంతో పాటు వాటికీ తగిన బద్రత ఉండటం లేదు. రోడ్డుపై తిరుగుతు ఆహార ఆన్వేషణలో ఉన్న ఓ గోవు కాలువలో పడి ఇరుక్కుపోయిన హృదయవిదారక సంఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలో దాసన్నపేట కూడలి వద్ద ఓ గోవు కాలువలో పడి, ఓ దుఖాణం మెట్ల క్రింద ఉండిపోయి లేవలేక అవస్థలు పడింది. ఎర్ర చెఱువుకు వెళ్ళే వార్గం వద్ద మున్సిపాలిటీ డస్ట్ బిన్ ఉంచుతుండటంతో అక్కడ అందులో తిండికోసం ప్రయత్నించి, చెఱువుకు వెళ్ళే మార్గం ఇరుక్కుగా ఉండటంతో జారి కాలువలో పడి, వంశీ జ్యూయలరీ దుఖాణం మెట్ల క్రిందకు వెళ్ళిపోయింది. దాన్ని గమనించిన దుఖాణం యజమాని వల్లూరి తారాకుమారి స్థానికులకు తెలవడంతో అక్కడికి ఫైర్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సూర్యారావు, రామక్రిష్ణ, రాంబాబు, ప్రసాద్‌లు అక్కడకు చేరుకుని స్థానికుల సహాయంతో ఆవును రక్షించి, బయటకు తీసారు. ఆవు పెద్దగా ఉండటంతో దుఖాణం ముందు బాగాన్ని విరగొట్టి ఆవును బయటకు తీసారు. మున్సిపాలిటీ నిర్లక్ష్యం వల్ల గోవులు రోడ్లపైకి వచ్చి, డస్ట్‌బిన్‌ల వద్ద పడేసే ఆహారం కోసం అవి ప్రయత్నించడంవాటి ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నాయని, దుర్గంధం వెదజల్లుతున్నా ఎవ్వరు పట్టించుకోవట్లేదని అక్కడి ప్రజలు చర్చించుకుంటున్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ఎంపీపీ పైల

విశాలాంధ్ర - కంచిలి : అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైయస్సార్ ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు అందజే స్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలకు అడక్కుండానే అవసరాలు తీర్చుతున్నామన్నారు. ఇంటింటికి తాగునీరు, గ్రామాల్లో రహదారుల ఏర్పాటు, ఇతర మౌలిక సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కా రానికి తగు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అది ,కారులు, పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మడ రామదాసు, వజ్జ మృత్యుంజయం, లద్దు కేశవ్ పాత్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవాంగుల ఏకాదశి నోములు

విశాలాంధ్ర - సోంపేట : పవిత్ర కార్తీక ఏకాదశి సందర్భంగా పట్టణంలోని దేవాంగ సామాజికవర్గీయులు పెద్దసంఖ్యలో ఒకే చోట హాజరై కార్తీక నోములు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు ముందుగా పట్టణంలోని వివిధ దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం రేకుల కాలనీలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : కార్తిక ఏకాదశి పూజలను శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుంచాల కురమయ్యపేటలోని దేవి ఆశ్రమం, అలినగరంలోని శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆలయం, ఎస్ఎం పురంలోని విష్ణు ఆలయాలు, ఎచ్చెర్లలోని శివాలయాలు, శ్రీనివాస ప్రార్థన మందిరం, పరిధి పేటలోని రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాలన్నీ భక్తులతో నిండిపోయాయి.

నేడు ఐటీడీఏలో న్యాయ అవగాహన సదస్సు

విశాలాంధ్ర - సీతంపేట : ఐటీడీఏ ప్రాంగణంలో శనివారం న్యాయ అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి నవ్య పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. గిరిజనులు, ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకునే విధంగా ఈ న్యాయ అవగాహన సదస్సు ద్వారా సూచనలు సలహాలు అందిస్తారని తెలియజేశారు.

ఘనంగా అఖండ నామ సంకీర్తన మాహాయజ్ఞం

విశాలాంధ్ర - బూర్జ : మండలంలోని కొత్త లక్కుపురం గ్రామంలో ప్రధాన అర్చకులు రంప శ్రీనాథ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో శ్రీహరి అఖండ నామ సంకీర్తన మహా యజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈ యజ్ఞానికి సుమారు ఇరవైకి పైగా భజన బృందాలు పాల్గొన్నాయి. ఏకాదశి పర్వదినాన శ్రీ రమా సహిత శ్రీ సత్యన్నారాయణ స్వామి దేవాలయంలో అభిషేకాలు విశేష పూజలు జరిగాయి. మహిళలంతా కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు, ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల నుండి సుమారు అయిదు వేల మంది భక్తులు పాల్గొన్నట్టు నిర్వాహకులు అంచనా వేశారు.